

ఆంధ్రజ్యోతి



బాపట్ల

1 ఆదివారం, 17 మార్చి 2024



ప్రజాగళంను విజయవంతం చేయండి : ఆనందబాబు



వేమూరులో టీడీపీ జనసేన సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 16: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు సంయుక్తంగా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామం వద్ద ఆదివారం నిర్వహించనున్న ప్రజాగళం మహాసభను విజయవంతం చేయాలని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ విస్తృత స్థాయి సంయుక్త సమావేశానికి బాపట్ల పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్రానికి పట్టిన జగన్ పీడ విరగడ కానుందన్నారు. ఎన్నికల నిబంధనలకు అధికారులు కానీ, అధికార పార్టీ వారు కానీ వ్యతిరేకంగా వ్యవహరిస్తే పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ఫొటోలు, వీడియోలు తీసి పార్టీ సెల్‌కు అందజేయాలన్నారు. తద్వారా ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వైసీపీ నాయకుడు వరికూటి అశోక్‌బాబు ఓట్ల కోసం కోట్లు ఎరవేసే ప్రక్రియను ప్రారంభించాడని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వలంటీర్లకు వ్యతిరేకం కాదని, ప్రస్తుతం ఉన్న విధానాలను అమలు పర్చడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ద్వారా సంపదను సృష్టించి అభివృద్ధిని సాధిస్తామన్నారు. సొంత చెల్లి, బాబాయి కూతురే జగన్‌కు ఓటు వేయవద్దని ప్రకటించడం ద్వారా జగన్ రాక్షసత్వం తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో వన్‌సైడ్ వేవ్ ఉందని దాన్ని పార్టీల శ్రేణులు ముందుకు తీసుకువెళ్ళే బాధ్యత తీసుకోవాలన్నారు ప్రతి బూత్ లెవల్‌లో ప్రతిరోజు శ్రేణులు శ్రమించాలన్నారు. 80సంవత్సరాలు దాటిన వారిని వికలాంగులను గుర్తించి ఒక జాబితాను తయారు చేసి కమీషన్ ఆదేశాల మేరకు వారి ద్వారా ఇంటి వద్ద నుంచే ఓటు వేయించే ప్రక్రియను ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దండే వెంకట సుబ్బారావు, మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, శివారెడ్డి, వాకా శేషుబాబు, గూదేటి ఎల్లారెడ్డి, జనసేన సమన్వయ కర్త ఊసా రాజేష్, జిల్లా అధ్యక్షురాలు సోమరౌతు అనురాధ, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఐదు మండలాల పరిధిలోని రెండు పార్టీల వివిధ విభాగాలకు చెందిన శ్రేణులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రులకిక.. విముక్తి

- ఐదు కోట్ల ఆంధ్రులకు స్వేచ్ఛా వాయువులు ● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- దరిద్రం వదిలిపోతుంది ● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ దవాడే
- రాష్ట్రాభివృద్ధి, భవిష్యత్తు కోసమే ఉమ్మడి పోరు: పురందేశ్వరి
- అయోధ్యలా అమరావతిని నిర్మించుకుందాం: పెమ్మసాని



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా దుర్మార్గపు పాలన కొనసాగుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు పాల్పడటం దారుణం. ఈ రోజుతో ఐదుకోట్ల ఆంధ్రులకు స్వేచ్ఛ లభించబోతోంది' అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి గుంటూరు పార్లమెంటు స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం రాష్ట్రంలో కూటమి ఏర్పాటు చేసి టీడీపీ- జనసేన- బీజేపీ ఎన్నికల్లో పోటీకి రావడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. పొత్తులో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా వాటిని అర్థం చేసుకుని, అరమరికలు లేకుండా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ ధావడే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ- టీడీపీ- జనసేన కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించబోతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి అనే శనిగ్రహం నుంచి ఏపీ ప్రజలకు విముక్తి కలగబోతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని విజయానికి కూటమిలోని పార్టీలన్నీ ఏకమై గెలిపించాలని కోరారు. మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని, రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడం ఖాయమని అన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ చిలకలూరిపేటలో ఎన్‌డీఏ కూటమి ప్రజాగళం సభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కోసం మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నామ న్నారు. ఆదివారం చిలకలూరిపేటలో జరిగే సభ కూటమి విజయానికి తొలి అడుగు అని స్పష్టం చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని మాట్లాడుతూ బీజేపీ నేతలు అయోధ్య నిర్మాణాన్ని చేపట్టినట్లుగా ఏపీ పునర్నిర్మాణానికి సహకరిస్తారని మనసారా కోరుకుంటున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడక లాంటిదన్నారు. బీజేపీ, జనసేన కూటమి డబుల్ ఇంజన్ లాగా అభివృద్ధి పథంలో దూసుపోవడం ఖాయం అని ఆశాభావం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తిరోగమనం ఎలా ఉంటుందో చవిచూడడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. సమావేశంలో జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, పిడుగురాళ్ల మాధవి, పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, బీజేపీ నేత నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని ఆధ్వర్యంలో చేరికలు

టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మినేని రామచంద్రరావు ఆధ్వర్యంలో 600 కుటుంబాలు నేడు టీడీపీలో చేరాయి. వారికి పసుపు కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.

అమరజీవి ఆదర్శం కావాలి: పెమ్మసాని

ధృఢ సంకల్పం వున్న వ్యక్తి ఎంత దూరం అయినా వెళ్లగలరు అనడానికి అమరజీవి పొట్టిశ్రీరాములు నిదర్శనమని పెమ్మసాని అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా గుంటూరులోని హిందూ కళాశాల కూడలిలో వున్న శ్రీరాములు విగ్రహానికి శనివారం ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి తరం రాజకీయ నాయకులకు అమరజీవి ఆదర్శమని, ఆయన వ్యక్తిత్వం, రాజకీయం, పోరాటం చూసి చాలా నేర్చుకోవాలని చెప్పారు.అనంతరం గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి అన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర బాబు(నాని), తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయాలి: కన్నా

సత్తెనపల్లి, మార్చి 16: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17వ తేదీ టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం మూడు పార్టీలు కలసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో జరుగుతున్న సభ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించనుందన్నారు. మూడు పార్టీల ఉమ్మడి పొత్తు ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరతాయన్నారు. ఈ సభ ద్వారా టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు పాల్గొని సభ విజయవంతంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నియంత పాలన మరో 45 రోజులే : ప్రత్తిపాటి



చిలకలూరిపేట అర్బన్, మార్చి 16: దేశ చరిత్రలో ఏ పాలకుడు చేయని రీతిలో రాష్ట్ర ప్రజలను పీడించుకు తిన్న జగన్ నియంతృత్వ పాలనకు గడువు మరో 45 రోజులేనని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సందర్భం, అవకాశం కోసమే ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ప్రజలు జగన్ బృందానికి తగిన గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి జగన్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కోడ్ ప్రకటనతో వైసీపీ ప్రభుత్వం దమనకాండకు అడ్డుకట్ట పడిందని, ఈ రూపంలో ప్రజలకు కొంత ఊరట లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. జగన్ ఐదు సంవత్సరాల విధ్వంసక పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఎస్సీ ఎస్టీల 28 పథకాలు, బీసీల పథకాలు 30, మైనార్టీలకు చెందిన 11 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌రెడ్డికి ఓటు వేయవద్దని సొంత చెల్లెలు చెపుతుందన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాదు ఈ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు జగన్‌రెడ్డిని తరిమి కొట్టబోతున్నారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

మాకొద్దీ అడ్డగోలు వైసీపీ పాలన

- 1551వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్ళూరు, మార్చి 16: మాకొద్దు అడ్డగోలు వైసీపీ పాలన అని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు 1551వ రోజుకు చేరుకున్నాయి. ఈ సదర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం నీటి ప్రాజెక్టు పూర్తి చేయకుండా తాత్సారం చేస్తూ వచ్చారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రవేటు పరం అవుతుంటే సీఎం జగన్‌రెడ్డి నోరు మెదపటం లేదన్నారు. ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి కనబడటం లేదన్నారు. అప్పుల మాత్రం లక్షల కోట్లలో కనబడుతున్నాయన్నారు. అమరావతి నిర్వీర్యంతో రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకమైందన్నారు. మూడు రాజధానులతో ఆంధ్రప్రదేశ్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. అమరావతే స్థిరమైన రాష్ట్ర ఏకైక రాజధాని అని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేసి చిత్తశుద్ధిని సీఎం జగన్‌రెడ్డి చాటుకోవాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో ఆందోళనలు కొనసాగాయి.

దోచుకొని దాచుకోవడం వైసీపీ నేతల నైజం

- 500 ఎకరాలు ఆక్రమణకు గురైనా దిక్కులేదు
- గ్రావెల్ తరలించేది ఎమ్మెల్యే మనుషులే
- మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెదపిచ్చయ్య ఆవేదన



మార్కెట్ యార్డు అధికారికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న నడికూడి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తగుళ్ల పెదపిచ్చయ్య

పిడుగురాళ్ల, మార్చి 16: ముప్పై ఏళ్లుగా నా సేద్యంలో వున్న పొలాన్ని కూడా కొందరు వైసీపీ నేతలు లాగేసుకున్నారు. నా వద్ద అన్ని ఆధారాలు వున్నాయని చెబుతున్నా పట్టించుకోలేదు. గురజాల నియోజకవర్గంలో అంతా ఒకరిదే పెత్తనం అంటూ నడికూడి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్, బీసీ సామాజికవర్గనేత, వైసీపీకి చెందిన తగుళ్ల పెదపిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మార్కెట్ యార్డులో అధికారులకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏళ్లుగా వైసీపీ కోసం పని చేస్తున్నా. మా గ్రామ సర్పంచ్‌ని కూడా గెలిపించుకున్నా ఎటువంటి ఉపయోగం లేదు. కనీసం చిన్నపని కూడా చేయించుకోలేకపోతున్నాం. నాలుగు ఎకరాలు లీజుకు తీసుకొని 170 ఎకరాల్లో మట్టి తోలేసుకుంటున్నారని తెలిపారు. గురజాలలో తహసీల్దారు ఆఫీసులో రికార్డులన్నీ అమ్మేసుకుంటారు అని ఆరోపించారు. నియోజకవర్గంలో సీనియర్‌లకు గౌరవం లేదు.. కనీసం పాఠశాల వాచ్‌మెన్‌ను, అంగన్‌వాడీని మార్చుకునే హక్కు లేనప్పుడు పార్టీలో కొనసాగుటమెందుకో అర్థంకావడం లేదు. సర్పంచ్ చెప్పినా కూడా చేయకుండా మరొకరు చెబితే ఆ పనులు చేయడం ఎంతో బాధించింది. నియోజకవర్గంలో 500 ఎకరాల భూములు దోచుకుంటున్నా దిక్కేలేదు. గురజాలలో అంతా ఒక్కరిదే పెత్తనం. నియోజకవర్గం మొత్తం మట్టి తోలకాలు జరిపించేది ఎమ్మెల్యే కాసు మనుషులేనని అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో వుంటున్నా ఇంతటి అగౌరవం, అరాచకం ఎన్నడూ చూడలేదని పెదపిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఏ పార్టీలో చేరడం లేదని, తరువాత నిర్ణయాన్ని వెల్లడిస్తానని పెదపిచ్చయ్య వివరించారు.

అప్పుడే ఉల్లం'ఘనులు'

- పొన్నూరులో జడ్పీ అతిథిగృహంలో పార్టీ కార్యకలాపాలు
- వెనిగండ్లలో వలంటీర్లతో వైసీపీ అభ్యర్థి అంబటి సమావేశం
- నరసరావుపేటలో ఎమ్మెల్యేతో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల భేటీ





వైసీపీ అభ్యర్థి అంబటి మురళితో కలిసి పొన్నూరులో సిద్ధం ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలంటీర్లు, నరసరావుపేట ఎమ్మెల్యేని కలిసిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు



కోడ్ వచ్చిన తర్వాత కూడా పెదకాకాని మండలం వెనిగండ్లలో వలంటీర్లతో సమావేశం నిర్వహించిన పొన్నూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

గుంటూరు సిటీ, మార్చి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన రోజే ఉల్లంఘనకు తెరలేచింది. షెడ్యూల్ విడుదలైన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికారులు, రాజకీయ నాయకులు నియమావళిని త్రోసిరాజన్నారు. పొన్నూరు పంచాయతీరాజ్ అతిథి భవనాన్ని కొద్దిరోజులుగా అధికార వైసీపీ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అక్కడ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా పరిషత్‌కు చెందిన అతిథి గృహంలో పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పూర్తిగా పార్టీ కార్యాలయంలా మార్చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఈ అతిథిగృహంలో పార్టీ కార్యకలాపాలు జరుగుతున్నా జిల్లా పరిషత్ అధికారగణం నిమ్మకు నీరెత్తినట్లుగా చూస్తూ ఉండిపోయింది. స్థానిక జడ్పీటీసీ తన సోదరుడు పేరుతో పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని అద్దెకు తీసుకుని పార్టీ కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళికతోనే గెస్ట్‌హౌస్‌ను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రయివేటు వ్యక్తికి అద్దెకు ఇచ్చాం కాబట్టి అక్కడ ఏమి జరిగినా తమకు సంబంధం లేదన్న వాదనను పాలక వర్గంలోని కొందరు వాదిస్తున్నారు. అత్యంత వివాదాస్పదంగా మారిన ఈ వ్యవహారంలో జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు కొంత ఉదాసీనత పాటిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు చూసీ చూడ నట్లు వదిలేయడం వల్లే పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని పార్టీ కార్యాలయంగా మార్చేశారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. శనివారం సాయంత్రం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్లలోని మైత్రి కల్యాణ మండపంలో మండలంలోని వలంటీర్లతో పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. కోడ్ వచ్చిన తర్వాత సమావేశం జరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రత్యర్థి పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్వామి భక్తిని చాటిన ఉద్యోగులు

నరసరావుపేటలో వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు శనివారం సాయంత్రం అక్కడ ఎమ్మెల్యేను కలవటం వివాదాస్పదంగా మారింది. ఉద్యోగాలు క్రమబద్దీకరణ చేసారంటూ కృతజ్ఞతలు తెలిపేందుకు ఎమ్మెల్యే వద్దకు వెళ్లినట్లుగా ఫొటోలు విడుదల య్యాయి. 'థాంక్యూ సీఎం సర్'అంటూ ఉద్యోగులు ప్లకార్డులు చేబూని ఎమ్మెల్యేతో ఫొటోకి ఫోజులిచ్చారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు ఎమ్మెల్యేను కలవటంతో ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియాలో ఆ ఫొటోలను షేర్ చేసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00







షెడ్యూల్.. వచ్చేసింది

- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఈ సారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లావాసులు ఎదురు చూస్తున్న సార్వ త్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా ఆంధ్రప్రదేశ్‌లో నాల్గో దశలో ఎన్నికలు నిర్వహించ నున్నట్లు ఈసీ ప్రకటించింది. దీంతో ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీల కు తగినంత సమయం అందుబా టులోకి వచ్చినట్లైంది. షెడ్యూల్ శనివా రమే విడుదలైనప్పటికీ గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానుంది. అదే రోజు నుంచి నామి నేషన్లను



బాపట్లలో ఫ్లెక్సీల తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఇచ్చారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. మే 13న సోమవారం పోలింగ్ జరుగుతుం ది. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహి స్తారు. గత 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చి చూస్తే అప్పట్లో మొదటి విడత లోనే ఇక్కడ ఎన్నికలు జరిగాయి. దాంతో పోలింగ్ జరిగిన తర్వాత ఓట్ల లెక్కింపు జరగడానికి 40 రోజులకు పైగా సమయం పట్టింది. ఈ దఫా రాష్ట్రంలో పోలింగ్ మొదటి విడతలో వద్దని కొన్ని పార్టీలు హైకోర్టుని ఆశ్రయించాయి. వారి విజ్ఞప్తిని పరిశీలించాలని హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి సూచిం చింది. కాగా ఈ దఫా నాల్గో విడతలో ఎన్నికలు జరగనుండటం, అలానే ఓట్ల లెక్కింపుని గతంతో పోల్చితే 11 రోజులు వెనక్కు జరిపింది. పండగలు, ఎండల తీవ్రత, పిల్లల పరీక్షలు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఈ నిర్ణ యాన్ని తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు వెలువడతాయి. గతంలో వలే తొలి విడతలోనే సార్వత్రిక ఎన్నిక లు జరగాలని వైసీపీ వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురు చూశాయి. దాని వల్ల ఎన్నికల ఖర్చు తగ్గడంతో పాటు సెంటిమెంట్ వర్కు అవుతుంద ని భావించాయి. ప్రతి పక్షాలు మాత్రం చివరి విడతల్లో ఎన్ని కలు జరిగితే తమకు మేలని భావిం చాయి. అయితే ఎన్నికల సంఘం మధ్యే మార్గంగా నాల్గో విడత లో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నది.

రెండున్నర నెలలకు పైగా కోడ్ అమలు

ఎన్నికల కోడ్ ఈ దఫా రెండున్నర నెలలకు పైగా అమలులో ఉండనుంది. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో శనివారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమలులోకి వచ్చేసింది. ఇది మొదలు జూన్ 4 ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అమలులో ఉంటుంది. దీనిని పరిగణ నలోకి తీసుకుంటే దాదాపు 75 రోజుల పాటు కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాప నలు చేయడానికి వీల్లేదు. కోడ్ అమలులోకి వచ్చిన దృష్ట్యా ప్రభుత్వ ఆస్తుల పై, ఆవరణల్లో ఏ పార్టీకి సంబంధించిన పోస్టర్లు, జెండాలు, రంగులున్నా వాటిని తొలగించాల్సిందే. ప్రభుత్వ కార్యాలయాలు, సమావేశ మందిరాల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలు తొలగించాలి. రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాలి.

ఆర్థిక సాయం విడుదలపై అభ్యంతరం

చేయూత, ఈబీసీ పథకాలకు సం బంధించి లబ్ధిదారులకు విడుదల చే యాల్సిన ఆర్థికసాయాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూ వస్తోన్నది. వాస్తవానికి వీటికి గత ఏడాదే ఆర్థికసాయం విడు దల చేయాలి.



రేపల్లెలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అలాంటిది ఎన్నికల కోసం వాయిదా వేస్తూ ఈ నెలలో లాం ఛనంగా విడుదల చేశారు. చేయూత కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.18,750, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు విడు దల చేయాలి. అయితే సీఎం లాంచ నంగా ప్రారంభించి రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు చేయూతకు సంబంధించి కొందరి ఖాతాలకే నగదు జమైంది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమ లులోకి వచ్చిన నేపథ్యంలో వాటిని నిలి పేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

ఛలో బొప్పూడి

- సభకు సర్వం సిద్ధం
- నేడే ప్రజాగళం బహిరంగ సభ
- తరలివస్తున్న అతిరథమహారథులు
- ఉరిమే ఉత్సాహంతో కూటమి శ్రేణులు
- చారిత్రాత్మక సభకు అసాధారణ ఏర్పాట్లు

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు అనంతరం.. ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత.. ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒకే వేదికపై తొలిసారి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఇందుకు చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా మారింది. ఆదివారం బొప్పూడి వద్ద ఉమ్మడిగా జరిగే భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా కూటమి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ రహదారి అనుకుని ఉన్న 300 ఎకరాల సువిశాల మైదానంలో అసాధారణరీతిలో ఏర్పాట్లు చేశారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే ఈ భారీ బహిరంగ సభలో జనం వారి గొంతుకను వినిపించేందుకు సిద్ధమయ్యారు. కూటమి అధినేతలు ముగ్గురూ సభకు హాజరు కానుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. అంచనాలకు మించి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరవుతారని నేతలు భావిస్తున్నారు. సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. సభ ఘన విజయానికి కూటమి నేతలు కసరత్తు పూర్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నాయకులు పది మంది చొప్పున వేదికపైకి అనుమతి ఇస్తున్నట్లు నేతలు తెలిపారు. సభా ప్రాంగణంలో త్రిమూర్తుల (మోదీ, చంద్రబాబు, పవన్) ప్రసంగాలను వీక్షించేందుకు 20 భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాల్గొనే ఉమ్మడి సభ కావడంతో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చే అవకాశం ఉందని నేతలు ఆశిస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఉమ్మడి కృష్ణ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులను జనాన్ని తరలించేందుకు ఎక్కడికక్కడ నేతలు సిద్ధం చేసుకున్నారు. ఇక కార్లు, జీపులు, ఆటోలను సమకూర్చారు. జనసమీకరణకు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా జిల్లాల నుంచి వేలాది ద్విచక్ర వాహనాలపై కూడా అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలిరానున్నారు. చిలకలూరిపేట, ఒంగోలు మార్గంలో జాతీయ రహదారి వెంట మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ లతో కూడిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు. సభ పూర్తయ్యేసరికి చీకటి పడే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాల వద్ద పెద్దపెద్ద ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

ప్రాంగణాన్ని జల్లెడ పట్టిన బాంబ్ స్క్వాడ్

ప్రధాని నరేంద్రమోదీ సభకు హాజరు కానుండటంతో ఎస్పీజీ బృందం ప్రత్యేక నిఘా ఉంచింది. వేదిక, ఆ పరిసరాలను శనివారం సాయంత్రం నుంచి స్వాధీనం చేసుకుంది. ప్రాంగణం మొత్తం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

ప్రత్యేక ఆసక్తి..

ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో తొలిసారి జరుగుతున్న సభ కావడం.. అతిరథమహారథులు తరలిరానుండటంపై రాష్ట్ర ప్రజానీకం ప్రత్యేక ఆసక్తి కనబరుస్తోంది. మూడు పార్టీల పొత్తు తర్వాత నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో జాతీయ మీడియా కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఢిల్లీ నుంచి జాతీయ మీడియా ప్రతినిధులు గుంటూరుకు చేరుకున్నారు. రాష్ట్ర భవిష్యకు దశ-దిశ నిర్దేశించనున్న సభగా ఏపీ ప్రజలు భావిస్తున్నారు. జగన్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర పునర్నిర్మాణానికి మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూట్ మ్యాప్ ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సభ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. వేర్వేరు హెలికాప్టర్లలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయి.

శనివారం ఉదయం నుంచే హెలిప్యాడ్లను ఎస్పీజీ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. అటువైపు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించారు. వీవీఐపీలు, వీఐపీలు సంచరించే హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహదారి వెంబడి బందోబస్తు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ పాలరాజు ఆదేశించారు. సభ ముగిసి నేతలు తిరుగు పయనమయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఐజీ, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మరో ఆరుగురు ఎస్పీలు, 11 మంది ఏఎస్పీలు, 27 మంది డీఎస్పీలు, 82 మంది సీఐలు, 256 మంది ఎస్ఐలు సహా 3900 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు

సభా ప్రాంగణాన్ని బ్లాక్ లుగా విభజించారు. మహి ళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను కేటాయించారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆనం రాంనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, రామరాజులతో పాటు బీదా రవిచంద్ర, దామచర్ల సత్య తదితర నేతలు శనివారం పరిశీలించారు. అధినేతలతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నా దెండ్ల మనోహర్, టీడీపీ జాతీ య కార్యదర్శి నారా లోకేశ్, సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో పాటు కూటమి ముఖ్య నేతలు సభకు హాజరు కానున్నట్లు సమాచారం. ప్రధాని సభకు వస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ట్రాఫిక్‌ను మళ్లించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఎస్పీలకు సూచనలిస్తున్న ఐజీ పాలరాజు



సభా ప్రాంగణంలో వేసిన కుర్చీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుల్లారావు,ఆలపాటి తదితరులు



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు



ట్రయల్‌రన్‌లో భాగంగా సభా ప్రాంగణంలో దిగుతున్న హెలికాప్టర్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్ తదితరులు



స్వాగత ద్వారాల ఏర్పాటు

ప్రధాని మోదీ పర్యటన ఇలా..

బొప్పూడిలో ఆదివారం జరిగే ఎన్‌డీఏ ప్రజాగళం బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకా నున్నారు. మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైనట్లు అధికా రులు ప్రకటించారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి మోదీ ఆదివారం సాయంత్రం 4.10 గంటలకు ప్రత్యేక విమా నంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.20కి గన్నవరం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బొప్పూ డికి బయలుదేరతారు. 4.50కి బొప్పూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 5.10కి ప్రజాగళం బహిరంగ సభ వేదిక పైకి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రధానిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సత్కరిస్తారు. సాయంత్రం 5.20 నుంచి 5.25 మధ్య పవన్ కల్యాణ్, 5.25 నుంచి 5.30 వరకు పురందేశ్వరి, 5.30 నుంచి 5.45 వరకు చంద్రబాబు ప్రసంగిస్తారు. 5.45 గంటలకు మోదీ ప్రసంగం ప్రారంభమౌతుంది. ఆయన ప్రసంగాన్ని పురం దేశ్వరి తెలుగులో అనువాదం చేస్తారు. 6.50 గంటల కల్లా మోదీ పర్యటన ముగించుకుని బొప్పూడిలో ఏర్పా టు చేసిన హెలిప్యాడ్ నుంచి బయలుదేరి రాత్రి 7.20కి గన్నవరం చేరుకుంటారు. రాత్రి 7.30 గంటలకు గన్న వరం నుంచి హైదరాబాద్ బేగంపేట విమానశ్రయానికి వెళతారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(ఆదివారం)

సహారీ (ఉదయం) 4.58 (సోమవారం)

అభ్యర్థులపై స్పష్టత



- ఉత్కంఠకు వైసీపీ అధిష్ఠానం తెర
- సురేశ్, రఘుపతిలకు మరోసారి అవకాశం
- అభ్యర్థులపై వ్యతిరేకతను లక్ష్యపెట్టని పార్టీ పెద్దలు

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో అధికారపార్టీ నుంచి బరిలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చేసింది. బాపట్ల లోక్‌సభ అభ్యర్థి సహా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల విషయంలో బరిలో నిలిచే అభ్యర్థులను శనివారం వైసీపీ ప్రకటించింది. అభ్యర్థుల ఎవరన్న అంశంపై వైసీపీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠకు అధిష్ఠానం తెరదింపింది. ఎమ్మెల్యే కోన, ఎంపీ నందిగం సురేష్‌లకు మరోమారు అవకాశమిచ్చింది. తీవ్ర ఉత్కంఠ రేపిన చీరాల అసెంబ్లీ స్థానం విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరాం తనయుడు వెంకటేష్‌కే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బాపట్ల ఎంపీగా సిట్టింగ్ నందిగం సురేష్‌కు వైసీపీ మరో మారు అవకాశం ఇచ్చింది. ఇక బాపట్ల అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే కోన మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వరుసగా రెండుసార్లు విజయం సాధిం చిన కోన హ్యాట్రిక్ మీద కన్నేశారు. చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్ తొలి సారి బరిలో నిలవనున్నారు. రేపల్లె నుంచి ఈవూరు గణేష్ మొదటి ప్రయత్నంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వేమూ రు నుంచి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి స్థానంలో పాణెం హనిమిరెడ్డి, పర్చూరులో ఎడం బాలాజీ పోటీలో ఉండను న్నారు. దీంతో అధికారపార్టీ తరఫున పోటీలో ఉండే వారి విషయంలో పూర్తి స్థాయి స్పష్టత వచ్చినట్లైంది

అసమ్మతిలో.. నిరాశ నిస్పృహ

బాపట్ల అసెంబ్లీ స్థానంపై అధికారపార్టీ సామాజిక వర్గం నేతలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అయితే సీఎం జగన్ తిరిగి కోన రఘుపతి పేరునే ఖరారు చేయడంతో సదరు నేతలు నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లారు. కోన ఓటమే ధ్యేయంగా తాము పనిచేస్తామని గతంలో ప్రకటించినా అధిష్ఠానం లెక్కచేయలేదని అర్థమవుతోంది. ఇక రేపల్లెలో సీటు కోసం చివరి నిమిషం వరకు ఎంపీ మోపిదేవి ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. కానీ అధిష్ఠానం ఈవూరు గణేష్ వైపే మొగ్గు చూపడంతో అక్కడ వైసీపీ కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. పర్చూరు విషయంలో తాజాగా నియమించిన ఎడం బాలాజీ గెలుపు మీద పార్టీ శ్రేణులు ఎప్పుడో నీళ్లు వదిలేసుకున్నారని సమాచారం. అద్దంకిలో పాణెం హనిమిరెడ్డి ఇప్పటికీ అక్కడ కుదరుకోలేని పరిస్థితి. చీరాలలో ఇంటిపోరు వైసీపీని వెంటాడుతూనే ఉంది. ఇలా దాదాపు ప్రతిచోట వైసీపీ అభ్యర్థుల విషయంలో అటు కేడర్‌లోనూ ఇటు సీటు ఆశించి భంగపడ్డ ఆశావహులలోనే అసంతృప్తి ఉంది.

రేపటి నుంచి పది పరీక్షలు

- 108 కేంద్రాలు.. 18,910 మంది విద్యార్థులు



కె.నారాయణరావు

బాపట్ల టౌన్, మార్చి 16: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు అన్నిచర్యలు చేపట్టారు. సోమవారం ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 30 వరకు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల్లో అక్రమాలు అరికట్టేందుకు ప్రతి ప్రశ్నాపత్రంపై క్యూఆర్‌కోడ్‌ను ముద్రించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే ఆయా పరీక్షా కేంద్రాన్ని గుర్తించి సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఈ నూతన విధానంలో అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణరావు తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు హాజరయ్యే 18,910 మంది విద్యార్థుల కోసం 108 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించామన్నారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు ఎండతీవ్రత దృష్ట్యా మెడికల్ కిట్‌లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో తెలిపారు.

హాల్‌టిక్కెట్ ఇవ్వకపోతే ఆందోళన

ఫీజులు చెల్లించలేదని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో 10 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్‌టిక్కెట్ ఇవ్వకపోతే ఆ విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లానాయకుడు ఆర్య తెలిపారు. హాల్‌టిక్కెట్లు ఇవ్వని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

- నివాళులర్పించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకుసాగాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పొట్టి శ్రీరాముల జయంతి కార్యక్రమం శనివారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ అమరజీవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుజాతి కొరకు ప్రాణాలర్పించిన మహనీయు డు పొట్టి శ్రీరాములు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. జాతీ అభ్యివద్ధిని కాంక్షిస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని అవిశ్రాంత ఉద్యమం చేశారన్నారు. తెలుగు ప్రజల మనోభావాలను కాపాడటానికే ఆయన నడిపిన ఉద్యమాలు చరిత్రలో నిలిచాయన్నారు. అలాంటి గొప్పనాయకుల జయంతి కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వై.నరసారెడ్డి, సహాయ బీసీ సంక్షేమశాఖాధికారి రాజేష్, సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు డీవీ.ఎస్.నాగరాజు, పర్యవేక్షకులు జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

గ్రూపు-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- 23 కేంద్రాలు.. 15040 మంది అభ్యర్థులు
- గుంటూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, హిందూ కళాశాల వద్ద హెల్ప్ డెస్కులు

గుంటూరు, మార్చి 16: గ్రూపు - 1 ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 15 వేల 40 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను సెంటర్లకు చేరవేసేందుకు ఆయా రూట్లలో సాయుధ ఎస్కార్ట్ సిబ్బందిని నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కేంద్రాల్లోకి ఉదయం 9:45 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. రెండో పరీక్షకు మధ్యాహ్నం 1.45 వరకు అనుమతిస్తారు. కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల వివరాల కొరకు గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ ద్వారాల వద్ద, ఆర్టీసీ బస్టాండ్, హిందూ కళాశాల కూడలి వద్ద పోలీస్ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేంద్రాలకు చేరుకునే రూట్, కళాశాల వివరాల సమాచారాన్ని హెల్ప్‌డెస్క్ వద్ద తెలుసుకోవచ్చన్నారు. డయల్-100, 8688831568, 8688831392 నెంబర్లకు ఫోన్ చేసి కేంద్రాలకు చేరుకునే సమాచారాన్ని అభ్యర్థులు తెలుసుకోవచ్చన్నారు.

ఎలక్షన్ కోడ్ రాకతో ఫ్లెక్సీల తొలగింపు

బాపట్ల,మార్చి16 : గత ఐదేళ్ళగా నియోజకవర్గ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న ఫ్లెక్సీలు ఎట్టకేలకు ఎలక్షన్ కోడ్ రావటంతో తొలగించటం ప్రారంభించారు. ప్రతి వీధిలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం, సంవత్సరాల తరబడి వాటిని ఉంచటం పరిపాటిగా మారింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు డిసెంబరు వరకు ఉంచటం ఇక్కడ ప్రత్యేకత. గతంలో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలు తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన కూడా ఇక్కడ జరిగింది. తుఫాన్ సమయంలో ఫ్లెక్సీ బోర్డులు ఇళ్ళల్లోకి కొట్టుకు వచ్చి అనేకమంది గాయాలు పాలైన సంఘటనలు జరిగాయి. ఏదిఏమైనప్పటికి ఎన్నికల కోడ్ రావటంతో ఫ్లెక్సీలకు స్వస్తి చెప్పి మున్సిపల్ అధికారులు వాటిని తొలగించేందుకు శ్రీకారం చుట్టటంతో ప్రజలు సంతోషిస్తున్నారు.

● వేమూరు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికలకు శనివారం నుంచి కోడ్ అమలులోకి రావడంతో కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధి గ్రామాల్లోని అధికారులు అప్రమత్తమయ్యారు. నిబంధనల మేరకు వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లు, తోరణాలు తొలగించడంతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. కరెంటు పోల్స్ తదితర స్థంబాలపై ఉన్న జెండాలు, మరికొన్ని శిలాఫలకాలపై ఉన్న ప్రతులను పూర్తిగా తొలగింపజేశారు. పంచాయితీరాజ్‌శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సి బ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఎస్సై రాజశేఖర్‌లు పర్యవేక్షించారు.



వేమూరులో పార్టీలకు చెందిన బ్యానర్లను తొలగిస్తున్న చిత్రం

● రేపల్లె, మార్చి 16 : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్, ఈసీ విడుదల చేయటంతో పురపాలక సంఘంలోని వివిధ రకాల రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను శనివారం తొలగించారు. రాజకీయపరమైన బోర్డులు, హోర్డింగ్‌లు పెట్టరాదని మున్సిపల్ సిబ్బంది సూచించారు. గోడలపై రాజకీయ పార్టీలవి రాయించరాదని సూచించారు. ఈ ఎన్నికల కోడ్ ఉన్నందున రాజకీయ పార్టీ నాయకుల ప్రచారాలు, సభలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు.

● పిట్టలవానిపాలెం, మార్చి 16 : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ ఈనెల 18 నుంచి అమలౌతుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించటంతో మండలంలోని 14 గ్రామపంచాయతీలలో కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శులు రాజకీయనాయకుల ఫ్లెక్సీలు, గోడపోస్టర్‌లు, బ్యానర్‌లు తదితర వాటిని పిట్టలవానిపాలెం తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆదేశాల మేరకు తొలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియ మూడురోజులలో ముగిసే విధంగా సంబంధితాధికారులు కార్యాచరణ చేపట్టాలన్నారు.

● కొల్లూరు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి రావడంతో విగ్రహాలకు ముసుగులు వేశారు. శనివారం మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కొల్లూరులోని రాజకీయ నాయకుల నాలుగు విగ్రహాలకు పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున ప్లాస్టిక్ పట్టాలతో ముసుగులు వేయించారు. గ్రామంలో వివిధ చోట్ల ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆయా పార్టీల వారికి సూచించామని, వారు తొలగించని పక్షంలో ఆదివారం తామే వాటన్నింటిని తమ సిబ్బందితో తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చిత్రాలు కూడా తొలగించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి ఖచ్చితంగా అమలు చేస్తామని, మీరిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.



కొల్లూరులో విగ్రహాలకు ముసుగులు వేస్తున్న పంచాయితీ సిబ్బంది

ఆరోగ్యభద్రతకు చిరుధాన్యాలు దోహదం

● డాక్టర్ సి.తారాసత్యవతి

బాపట్ల, మార్చి 16: వాతావరణ పరిస్థితులు, ఆరోగ్య భద్రతకు చిరుధాన్యాలు ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేయాలని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ సి.తారాసత్యవతి రైతులకు సూచించారు. బాపట్ల మండలం మర్రిపూడి గ్రామంలో చిరుధాన్యాలు, స్థానికల పంటలసాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్‌పై శనివారం సాంకేతిక సదస్సు నిర్వహించారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ సత్యవతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృష్ణా, గోదావరి బేసిన్‌లో సజ్జలు చాలా మంచి దిగుబడి వస్తుందని రైతులకు లాభాలు వస్తాయని తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ విజయాభినందన మాట్లాడుతూ రైతులందరు చిరుధాన్యాలు రోజువారి ఆహారంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు హాస్టళ్ళల్లో మెనూగా చిరుధాన్యాలను ఆహారంగా ఇవ్వాలన్నారు. సదస్సులో భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సుబ్బరాయుడు, డాక్టర్ అరుణ, డాక్టర్ సృజనారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సేవానాయక్, శ్రీనివాస్‌లు పాల్గొని రైతులకు చిరుధాన్యాల పంటలసాగు, సాంకేతిక పద్ధతులపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ సి.తారాసత్యవతి

జాతీయ లోక్‌అదాలత్‌లో 113 కేసులు పరిష్కారం

బాపట్ల,మార్చి 16 : బాపట్ల కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 113 కేసులు పరిష్కరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గుంటూరు ఫోక్సో కోర్టు జడ్జి కె.ఎస్.లక్ష్మణరావు ఛైర్మన్‌గా వ్యవహరించారు. పరిష్కరించిన కేసులలో రూ.56,76,969 లావాదేవీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో జడ్జి జి.వాణి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్రనాథ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.సాంబయ్య, లోక్ అదాలత్ సభ్యులు డి.ఫిలిఫ్, సీహెచ్ రామాంజనేయులు, వై.నరేష్‌బాబు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



లోక్‌అదాలత్ ఉద్దేశించి మాట్లాడుతున్న గుంటూరు ఫోక్సో కోర్టు జడ్జి లక్ష్మణరావు

కోనకు టిక్కెట్టు కేటాయించటంపై బ్రాహ్మణ సమైక్య హర్షం

బాపట్ల, మార్చి 16 : ఎమ్మెల్యే కోన రఘుపతికి తిరిగి బాపట్ల ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించటంపై శ్రీభావపురి బ్రాహ్మణ సమైక్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి వరుసగా మూడుసార్లు టిక్కెట్టు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. హర్షం ప్రకటించిన వారిలో అధ్యక్షుడు నిభానుపూడి శ్రీహరిప్రకాష్, ఎస్.శ్రీనివాస్, కె.మోహన్ శ్రీనివాస్, బి.నారాయణ, గోపాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

బాపట్ల,మార్చి 16 : బాపట్ల ఆర్యవైశ్య నాయకులు, బీజేపీ నాయకులు మార్కెట్ రోడ్డులోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాళం నరేష్, పారేపల్లి చంద్ర, మామిడి రమేష్, చొక్కాకుల వీర్రాజు, దవలేశ్వరపు శ్రీను, మువ్వల శ్రీనివాస్, రాము, సుజిత్, ప్రసాద్, నాగేశ్వరరావు, రవికాంత్, అఖిల్, మణికంఠ, సోమయ్య, వెంకటేశ్వర్లు, గోపాలరావు, శ్రీనివాస్, నరసింహారావు, రామయ్య, నరసింహారావు, వీర్రారెడ్డి, కె.శ్రీనివాసరావు, శ్రీహరి పాల్గొన్నారు.

● బాపట్ల ఏరువాక కేంద్రంలో విశ్వవిద్యాలయ విస్తరణా సంచాలకులు డాక్టర్ విజయాభినందన ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బాల మురళీధర్‌నాయక్, డాక్టర్ జె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని అసోసియేట్‌డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ సంధ్యారాణి, డాక్టర్ ఎం.లత, డాక్టర్ షేక్ హసీనా బేగం, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్ఆర్ కోటేశ్వరరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ డీవి సాయిరాంకుమార్ పాల్గొన్నారు.

● పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, డాక్టర్ సోమేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత, దశరథ రామిరెడ్డి, డాక్టర్ ఫణేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న తహసీల్దార్ నిర్మలానందబాబా

● కర్లపాలెం, మార్చి 16 : వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పొట్టిశ్రీరాముల పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘనాయకులు, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, మార్చి16 : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిలా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేపట్టారన్నారు. అనంతరం వారు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాభివృద్ధి ఛైర్మన్ ఎంసీ సుబ్బారెడ్డి, పిట్టలవానిపాలెం మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు బేతాళం సుబ్బరాజు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు గుడవర్తి రామారావు, సూర్య రమేష్, సూర్యచంద్రశేఖర్, నిడమానూరు మురళీ, సకల నారాయణ, కొత్తమాసు మల్లికార్జునరావు, తాడికొండ నాగమురళీ, గ్రంథాలయ పాఠకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

● కర్లపాలెం, మార్చి 16 : పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కర్లపాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం వాసవి క్వీన్స్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్వీన్స్‌క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు



వేమూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

● వేమూరు, మార్చి 16 : మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వేమూరులో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు నంబూరు గాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ ఎంపీపీ, సంఘ గౌరవాధ్యక్షులు బొలిశెట్టి ప్రభాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహామనిషి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొలిపాకుల శంకర్, కొమ్మూరు రమణ, సాయి, శంకర్, మల్లిఖార్జున, అత్తోట శ్రీను, దుంపా గణేష్ పాల్గొని శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

● భట్టిప్రోలు, మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు వాసవీక్లబ్ అధ్యక్షుడు బూర్లె సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక రథం సెంటర్‌లో గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తూనుగుంట్ల సాయిబాబా, కూరాళ్ళ రవికుమార్, బొలిశెట్టి శ్రీనివాసరావు, శనగపల్లి శ్రీనివాసరావు, రవితేజ, బూర్లె చంద్రశేఖరరావు, బూర్లె రాంప్రసాద్, చీదెళ్ళ ఉమామహేశ్వరరావు, తూనుగుంట్ల సుధారాణి, కుబేర వనిత క్లబ్ సభ్యులు కోట నాగజయలలిత, తూనుగుంట్ల బేబీరాణి, మద్దుల లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

విధులను అంకితభావంతో నిర్వహించాలి : తహసీల్దార్

పిట్టలవానిపాలెం, మార్చి 16 : పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.స్ఫూర్తి అధ్యక్షతన బూత్‌లెవల్ అధికారులు, వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ స్ఫూర్తి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వచ్చే సాధారణ ఎన్నికలలో విధులు నిర్వహించే బూత్‌లెవల్ అధికారులు, వీఆర్వోలు అంకితభావంతో పని చేయాలని, ఆయా పార్టీల రాజకీయ నాయకులకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పరిగణలోకి తీసుకొని బాధ్యతాయుతంగా ఉద్యోగ నిర్వహణ చేయాలని ఎన్నికల సమయంలో ఎలాంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా, జూనియర్ అసిస్టెంట్ రిక్టర్, బిఎల్‌వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాపు

బాపట్ల, మార్చి 16 : బాపట్ల మండల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 5 రోజులుగా జరుగుతున్న వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి సీనియర్ టెక్నికల్ మేనేజర్ వి.పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వర్క్‌షాపు వల్ల విద్యార్థులు మెళుకువలు తెలుసుకొని ముందుకు వెళతారన్నారు. దీనివల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి జి.వెంకటేశ్వరి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార పక్షోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో శైలజ తదితరులు

గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి : సీడీపీవో

కర్లపాలెం, మార్చి 16 : గర్భవతులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో శైలజ అన్నారు. పోషకాహార పక్షోత్సవాలు సందర్భంగా కర్లపాలెం పంచాయతీలోని బంగారరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీడీపీవో శైలజ పాల్గొని గర్భవతులు, బాలింతలకు ఏఎన్ఎం రత్నకుమారి చేత పరీక్షలు నిర్వహించి ప్రతిఒక్కరికి హీమోగ్లోబిన్ 12 గ్రాములు ఉండాలని తెలియజేశారు. తల్లులు ఎక్కువగా గుడ్లు, చిరుధాన్యాలు వంటివి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి, ఏఎన్ఎం కె.రత్నకుమారి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, మార్చి16 : రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. శనివారం కొండబొట్లవారిపాలెం గ్రామపరిధిలో భరత్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార దినోత్సవ కార్యక్రమంలో ఆకుకూరలు, కూరగాయలు ఏర్పాటు చేసి దానిలోని పౌష్టిక విలువలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 162 కేసుల పరిష్కారం

రేపల్లె, మార్చి 16 : జాతీయ లోక్ అదాలత్‌లో 162 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 31 సివిల్ కేసులు, 129 క్రిమినల్ కేసులు, రెండు ప్రీలిటికేషన్ కేసులు మొత్తం 162 కేసులు పరిష్కారం కాగా కక్షిదారులకు సుమారు రూ.84 లక్షలు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.రూపశ్రీ, డిఎస్ హరికుమార్, ఎం.కృష్ణారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో మహిళపై దాడి

బాపట్ల, మార్చి 16 : పట్టణంలోని నరాలశెట్టిపాలేనికి చెందిన పోతంశెట్టి శారదాదేవికి భర్త రామ్మోహనరావు నుంచి వచ్చిన ఎకరం 20 సెంట్ల భూమిని ఆక్రమించాలని చూస్తున్న నాగరాజును ప్రశ్నించినందుకు దాడి చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి దాడి చేసి కొట్టారంటూ ఆసుపత్రిలో చేరిన శారదాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

చుండూరు మార్చి 16 : మోదుకూరులో శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయశాఖ, దాతల సహకారంతో ఈ దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. చోళరాజుల నాటి కాకతీయ గణపతి కుమారుడైన కాకతీయ రుద్రుడు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఎక్కడా కనిపించని ఏకరాతి దీపస్తంభం ఈ దేవాలయ ప్రాంగణంలో ఉంది. కార్యక్రమంలో గ్రామస్తులు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం



మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె, మార్చి 16 : మహనీయుల వీరోచిత పోరాటాలు, ప్రాణాలు అర్పించటంతోనే స్వాతంత్ర్యాన్ని దక్కించుకోగలిగామని, అలాంటి మహనీయుల ఆశయాలను యువత స్ఫూర్తిగా పుణికి పుచ్చుకుని ముందుకు వెళ్ళాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. శనివారం పాతపట్నంలోని అంకమ్మ చెట్టు వద్ద ఆర్యవైశ్యసంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన గాంధీజీ, పొట్టి శ్రీరాములు, మాజీ ముఖ్యమం త్రి కొణిజేటి రోశయ్య విగ్రహాలను ఎంపీ మోపిదేవి వెంకటరమ ణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావులు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు 56 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను అర్పించటంతోనే ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకోగలిగామన్నారు. దేశ స్వాతంత్ర్యంలో కీలక పాత్ర పోషించిన గాంధీజీ సేవలు మరువలేనివన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అపర చాణిక్యుడు కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్ర సంక్షేమయుల కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గణేష్, వైసీపీ నాయకులు గడ్డం రాధాకృష్ణ, ఛైర్‌పర్సన్ కట్టా మంగా, వైస్ ఛైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, జీ.ప్రశాంత్, ఆర్యవైశ్య నాయకులు తూనుగుంట్ల పాండురంగారావు, పండు, నారాయణమూర్తి, బొలిశెట్టి ధర్మారావు, యెండూరి రాజేష్, మద్ది పద్మజ, వేమల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు సిద్ధమవుతున్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చుండూరు, మార్చి 16 : చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద ఆదివారం జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయడానికి తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు శనివారం రాత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మండలం నుండి ఈ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్ళడానికి కావాల్సిన ఏర్పాట్లను ఈ సందర్భంగా చర్చించుకున్నారు. ప్రతి కుటుంబం నుండి ఇద్దరు ముగ్గురు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొనాలని తీర్మానించారు. దీంతో పాటు ఇక నుండి జట్టుగా ఏర్పడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని వీరు తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి నాగేశ్వరరావు, చెక్కా బుచ్చయ్య, యాసం జగదీష్, జొన్నకూటి సాంబశివరావు, కాశిం, అశోక్, పిల్లి ప్రకాష్, రాంబాబు, సుగ్గున బాబు, వడ్రాం గోపి, కేలం విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం జయప్రదం చేయాలి



ప్రజాగళం జయప్రదం చేయాలని మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు

కర్లపాలెం, మార్చి 16 : ప్రజాగళం జయప్రదం చేయాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ మండల నాయకులు శనివారం పిలుపునిచ్చారు. ఆదివారం బొప్పూడిలో జరగబోయే బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ప్రజాగళం బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, బీజేపీనాయకులు షేక్ కరీముల్లా, జనసేన నాయకులు చిలకల సురేంద్రబాబు, పఠాన్ అహ్మద్‌బాషా, బెజ్జం వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు కోరారు.

పంచాయతీ నిధులు రూ.2.33 కోట్లు గోల్‌మాల్

● మంత్రి నాగార్జున బినామీ కంపెనీలకు మళ్ళిన నిధులు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా



అవినీతిపై ఆధారాలు చూపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు, మార్చి 16 : భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో రూ.2.33 కోట్ల అవినీతి జరిగిందని, సాక్షాధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎఫ్ఎంఎస్‌ని నిర్వీర్యం చేస్తూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో దొంగ బిల్లులు పెట్టి రూ.2.33 కోట్లు డబ్బులు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బొక్కేశారని ఆరోపించారు. మంత్రి నాగార్జునకు చెందిన బినామీ కంపెనీ సభ్యులకు చెల్లింపుల ద్వారా పంచాయతీ సొమ్మును దోచి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు లబ్ధిదారులకు నేరుగా చెల్లించకుండా సిబ్బంది ఖాతాల్లో సదరు నగదును జమ చేసి దోచుకున్నారన్నారు. ఆడిట్ రిపోర్టు తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగాయంటూ సదరు అధికారులు 427 అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ రిపోర్టు ఇచ్చారన్నారు. స్వాహా చేయగా మరొక రూ.1.19 కోట్లు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. అభివృద్ధిని మరచి ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా ఖర్చు చేయడానికి ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నదని ఆగ్రహం వ్యక్త చేశారు. ప్రజల సొమ్ము తింటానికా, ప్రజాధనాన్ని దోచుకోవడానికి మీకు అధికారాన్ని ప్రజలు అప్పగించింది అని సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీలను ప్రశ్నించారు. అవినీతి బయటకు రాకుండా మంత్రి నాగార్జున కనుసన్నల్లో భాగపంపిణీలు జరిగాయని ఆధారాలు ఉన్నాయన్నారు. అవినీతిపై చర్చించేందుకు బహిరంగ చర్చకు రావాలని మంత్రి నాగార్జునకు సవాలు విసిరారు. దొంగబిల్లులు పెట్టి పంచాయతీలో చేసిన అవినీతిపై టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ జరిపించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సాయిబాబా వివరించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధి చేయగల వ్యక్తుల్ని ఎన్నుకోవాలని, రానున్న ఎన్నికల్లో ఆనందబాబుకు అండగా నిలవాలని సాయిబాబా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, జంగం శ్యాంసన్, ఆదిన బసవపున్నయ్య, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, లోకానంద్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది పక్షపాతం లేకుండా పని చేయాలి

● నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వసంతరాయుడు

వేమూరు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సిబ్బంది పక్షపాతం లేకుండా పని చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు కోరారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో శనివారం నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ నియమావళిని సిబ్బందికి తెలియజేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధికారి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడం జరిగిందని, ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి తక్షణ చర్యలకు అధికారులు సిద్ధం కావాలన్నారు. ప్రధానంగా పార్టీలకు సంబంధించిన ప్రచార ప్రకటనలు, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, మంత్రుల ఫోటోలను తొలగింపజేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే గ్రామాల్లో ఎన్నికల వేళలో నిబంధనలకు విరుద్ధంగా జరిగే కార్యక్రమాలను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తక్షణమే తెలియజేసే విధంగా సి విజిల్ యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా సంబంధిత సమాచారాన్ని కమిషన్‌కు పంపితే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో పోలీసుశాఖ అధికారులతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్స్ పంపిణీ

వేమూరు, మార్చి 16 : మండలంలోని 10వ తరగతి విద్యార్థులకు విజన్ హోప్ హోప్ మిషన్, క్లోరీ ఆర్ఫన్ హోమ్, జనసేన నేతలు పరీక్ష కిట్స్ పంపిణీ చేశారు. చావలిలో జరిగిన కార్యక్రమంలో సిఐ పసుపులేటి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్ఫన్ హోమ్ అధినేత, హైకోర్టు న్యాయవాది రవీంద్ర, ఎస్సై రాజశేఖర్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, తెనాలి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అశోక్‌కుమార్, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పెరవలి, చావలి, కుచ్చెళ్ళపాడు, వేమూరు, జంపని వరహాపురం పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులకు జనసేన నాయకులు కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త ఊస రాజేష్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, పోకల శ్రీనివాస్, దాసరి రమేష్, దాసరి రంగా తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రం వద్ద చోరీకి యత్నం

కొల్లూరు, మార్చి 16 : సంపద సృష్టి కేంద్రం వద్ద ఉన్న వస్తువులను చోరీ చేయడానికి కొందరు ప్రయత్నించినట్లుగా పంచాయతీ కార్యదర్శి బి.మల్లిఖార్జున తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువున ఉన్న కేంద్రం వద్ద పంపు మోటారు తదితర వస్తువులను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కోసి వేసి ఆటోలో తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అప్పుడే అక్కడకు వెళ్లిన పంచాయతీ సిబ్బంది కంటపడ్డారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న పొలాల్లోకి పారిపోయినట్లు సిబ్బంది కార్యదర్శికి తెలిపారు. చోరీకి యత్నించిన వస్తువులను ట్రాక్టర్‌లో తీసుకువచ్చి సచివాలయం-3లో వాటిని భద్రపరిచారు. కొల్లూరు జగనన్న కాలనీలో సైతం మోటార్లు చోరీకి గురవుతున్నాయి. తమ గృహాలకు అవసరమైన నీటి వినియోగానికి బోర్లు వేయించుకుని వాటికి సబ్ మెర్సిబుల్, మోనోబ్లాక్ మోటార్లను అమర్చుకున్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళల్లో ఆయా మోటార్లను చోరీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 8 సబ్ మెర్సిబుల్, 10 వరకు మోనోబ్లాక్ మోటార్లు దొంగిలించబడ్డాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

పది పరీక్షలకు అంతా సిద్ధం

చినగంజాం, మార్చి 16: పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి జరగనున్నాయని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు తెలిపారు. వీటికోసం చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో 417 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. చినగంజాం, కడవకుదురులో పరీక్షా కేంద్రాల్లోని వసతులను పరిశీలించినట్లు ఎంఈవో తెలిపారు.

ఇంకొలు: ఇంకొల్లు మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారులు రాఘవరావు, శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని పరీక్షా కేంద్రాలలో వసతి ఏర్పాట్లను వారు పరిశీలించారు. మండలంలో 855 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

మార్టూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాధికారి సీహెచ్ వస్రాంనాయక్ తెలిపారు. సోమవారం నుంచి జరగనున్న ఈ పరీక్షలను మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు రాయనున్నారు. మార్టూరు, వలపర్ల, ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో, మార్టూరులోని రాయల్, శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ కేంద్రాలలో 1045 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో తెలిపారు. అలాగే, యద్దనపూడి మండలంలో రెండు కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో గోపి తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

అద్దంకిటౌన్, మార్చి 16: మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయేషా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సొసైటీ డైరెక్టర్ అయేషా బేగం, కోశాధికారి అంజలి అందజేశారు. అలాగే, కలవకూరు గ్రామానికి చెందిన తేళ్ల హనుమంతరావు పదో తరగతి విద్యార్థులకు సాయం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌గా కృష్ణకాంత్ బాధ్యతల స్వీకరణ

వేటపాలెం(చీరాల), మార్చి 16: వేటపాలెం తహసీల్దార్‌గా కృష్ణకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తూ బదిలీపై వేటపాలెం వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. నూతన తహసీల్దార్ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

విలువైన సమయం వృథా చేసుకోవద్దు!

చీరాలటౌన్, మార్చి 16: ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపులతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుధ పేర్కొన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈక్రమంలో 90 క్రిమినల్, తదితర కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న గ్రానైట్ పరిశ్రమలు

మార్టూరు, మార్చి 16: మార్టూరు ప్రాంతంలో మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలు ఆదివారం నుంచి తెరుచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షోభంలో కూరుకు పోతున్న గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని కోరుతూ ఈనెల 8 నుంచి ఈ ప్రాంతంలోని సుమారు 200 గ్రానైట్ పరిశ్రమలను యజమానులు మూసివేశారు. ఇదిలాఉండగా గత నాలుగు రోజుల నుంచి కృష్ణా జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాపరెడ్డి, నెల్లూరు ఏడీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందాలతో మార్టూరు మండలంలోని జొన్నతాళి సెంటరు సమీపంలోని కామేపల్లి లక్ష్మీప్రసాద్‌కు చెందిన రెండు గ్రానైట్ పరిశ్రమలను తనిఖీ చేశారు. అతనికి చెందిన బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని గ్రానైట్ క్వారీలను తనిఖీ చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఒకవైపు గ్రానైట్ పరిశ్రమలను మూత వేయడం, మరోవైపు మైనింగ్ విజిలెన్స్ అధికారుల తనిఖీలతో మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమల యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎట్టకేలకు గ్రానైట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీలమేరకు మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలను తెరవాలని అసోసియేషన్ నిర్ణయించింది.

వలపర్లలో కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, మార్చి 16: మండలంలోని వలపర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమ్మవారి దేవాలయాన్ని నిర్మాణం చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం భక్తులకు భారీగా అన్న సంతర్పణ చేశారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

మార్టూరు, మార్చి 16: జాతీయ రహదారిపై యలవర్తి కోల్డ్ స్టోరేజీ ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనగా షేక్ బాషా అనే వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలోని నాగరాజుపల్లికి చెందిన బాషా వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో మరో ద్విచక్రవాహనదారుడు బాషా బైక్‌ను ఢీకొట్టడంతో కాలికి తీవ్రగాయమైంది. హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. మార్టూరుకు చెందిన మరో బైకిస్టుకి స్వల్ప గాయాలయ్యాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు, మార్చి 16: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన నాల్గవ విడత చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంపీపీ మేకా ఆనందకుమారి, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, నాయకులు కొల్లా వెంకట్రావు, గాజుల రమేష్ పాలెపోగు రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శేషుకుమారి

పర్చూరు, మార్చి 16: భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శేషుకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా చేబ్రోలు ప్రభుత్వ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పర్చూరు ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా చింపారెడ్డి బాధ్యతలు నిర్వహించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

చినగంజాం, మార్చి 16: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక, ఊరురా జనవిజ్ఞానం రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక శివాలయం సెంటర్‌లో ప్రజాస్వామ్యం ఎన్నికల ఓటరు చైతన్య విధాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లపోలు నాగమనోహర్‌లోహియా, పృథ్వి రామారావు, సున్నా హరిబాబు, ఎస్.రమణారెడ్డి పాల్గొన్నారు.

రొంపేరులో ఆగని మట్టి తవ్వకాలు

- అక్రమార్కుల్లో ఆధిపత్యపోరు
- కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన డ్రైనేజీ అధికారులు


ట్రాక్టర్లను ఆపి హెచ్చరిస్తున్న ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు

వేటపాలెం(చీరాల), మార్చి 16: నాలుగు ఎక్స్‌కవేటర్లు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రెండు మూడు రోజుల నుంచి అధికారపార్టీకి చెందిన అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రొంపేరులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట సమీపంలో రొంపేరు భూముల్లో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమార్కుల్లో ఆధిపత్య పోరుతో పోటీపడి అక్రమ తవ్వకాలు సాగించారు. దంతం హనుమంతరావు అనే వ్యక్తికి 300 క్యూబిక్ మీటర్లు మట్టి నిబంధనల మేరకు తవ్వుకునేందుకు డ్రైనేజీ అధికారులు సీనరేజీ చెల్లించేవిధంగా అనుమతి ఇచ్చారు. అయితే, రొంపేరులో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు మట్టిని తరలించారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. డ్రైనేజీ అధికారులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసుల రంగప్రవేశంతో తాత్కాలికంగా తవ్వకాలు, తరలింపు నిలిపివేసి తరువాత కొనసాగించారు. శనివారం సూర్యోదయం నుంచి యథావిధిగా ఎక్స్‌వేటర్‌తో ట్రాక్టర్లకు మట్టిని నింపి తరలించారు. ఈక్రమంలో డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆసమయంలో మార్గమధ్యంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని నింపుకుని రావటం వారి కళ్లబడింది. దీంతో వాటిని నిలిపివేసి ట్రాక్టర్ డ్రైవర్లను హెచ్చరించారు. 300 క్యూబిక్ మీటర్లను అనుమతి పొందిన దంతం హనుమంతరావుకు ఫోన్‌చేసి పిలిపించారు. ఈఈ మురళీకృష్ణ మాట్లాడుతూ అనుమతి పొందిన 300 క్యూబిక్ మీటర్లుకన్నా ఇప్పటికే భారీగా మట్టిని తవ్వకాలు జరిగినట్లు తమ పరిశీలనలో వెల్లడయిందన్నారు. ఇచ్చిన అనుమతిని కూడా రద్దు చేస్తున్నట్టు హనుమంతరావుకు చెప్పారు. ఇకపై ఎవరు మట్టిని తవ్వినా, తరలించినా వాహనాలను సీజ్ చేయించటం, వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆధిపత్యపోరు.. రొంపేరులో మట్టి తవ్వకాలకు సంబంధించి అధికారపార్టీకి చెందిన అక్రమార్కుల మధ్య ఆధిపత్యపోరు సాగుతోంది. అందులో ఒకరు(ఒక వర్గం) 300క్యూబిక్ మీటర్లకు అనుమతి పొందగా, మరొకరు(మరో వర్గం) అక్రమాలను కట్టడి చేయాల్సిన శాఖల్లో ఒక శాఖకు చెందిన స్థానిక అధి కారి అండతో అనధికారికంగా తవ్వకాలు సాగించారు. ఈ క్రమంలో వారి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో ఒకరిని మించి మరొకరు అక్రమ తవ్వ కాలకు పాల్పడటం తమకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి!


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, మార్చి 16: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడానికి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేవని రోటరీ క్లబ్ సభ్యులు కొనియాడారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి కొల్లా భువనేశ్వరి, మురళి, జ్యోతి చంద్రమౌళి, షేక్ మహమ్మద్ రఫీ, తమ్మన శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాబుజి తదితరులు పాల్గొన్నారు.

చీరాల: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లోని ఆయన విగ్రహానికి పలుపార్టీల నేతలు, పలు సంఘాలు, సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవి క్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండులో వేసవి కాలం పూర్తయ్యే వరకు తాగునీటి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ శ్యామల చలివేంద్రను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఊటుకూరి బాలవెంకట సత్యన్నారాయణ, నంజూరి అనూరాధ, వల్లంపట్ల వెంకటేశ్వరరావు, తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యామ్‌సుందరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వేటపాలెం ప్రధాన కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిర ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కోట శివరామకృష్ణ, అమరా శ్రీనివాసరావు, జీవీ లక్ష్మీనారాయణ, పద్మనాభుని పవన్‌కుమార్, కోట సుచిత్ర, భయ్యా జ్యోతి, పొట్టి శైలజ తదితరలు పాల్గొన్నారు.

మార్టూరు: అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలను శనివారం యద్దనపూడి మండలం యనమదల గ్రామంలోని పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వంద మంది విద్యార్థుకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.హనుమంతరావు, దారా బాలసుబ్బారావు, కె.వెంకటరాంబాబు, పి.బసవయ్య, ప్రధానోపాధ్యాయుడు భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే, మార్టూరు మండల కేంద్రంలో మండల ఆర్య వైశ్య భవనం వద్ద ఆర్యవైశ్య నాయకులు పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోదడుగు మురళి, పొత్తూరి శివ, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పేరిరెడ్డి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీపీయూపీ పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం 150 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి గురుప్రసాద్, కార్యదర్శి కొత్తూరి వెంకటేశ్వరరావు, మామిడిపాక కిరణ్ కుమార్, పాఠశాల సిబ్బంది పోలిశెట్టి హనుమంతరావు, బొజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పర్చూరు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు మామిడిపాక హరిప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంతో కష్టపడి పనిచేశా.. బలిపశువును చేశారు!

- పరోక్షంగా వైవీని విమర్శించిన బాచిన కృష్ణచైతన్య
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న కృష్ణచైతన్య


అనుచరులతో మాట్లాడుతున్న బాచిన కృష్ణచైతన్య

అద్దంకి, మార్చి 16: వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వైసీపీలో అద్దంకిలో సీటు లేకుండా చేయటం బాధ కలిగించిందని వైసీపీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. తండ్రి, కొడుకులు బాచిన చెంచుగరటయ్య, కృష్ణచైతన్యలు తన అనుచరులతో కలిసి ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు శనివారం అద్దంకి నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్ళారు. ముందుగా తనతో కలిసి టీడీపీలో చేరేందుకు సంసిద్ధులైన నియోజకవర్గంలోని పల్లుగ్రామాల నేతలతో సమావేశమయ్యారు. అనంత రం కృష్ణచైతన్య విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి బంధువుగా చెప్పుకోవటం మినహా ఎలాంటి అర్హత లేదని, అద్దంకి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి నిధులు మంజూరు చేయించలేదని పరోక్షంగా రాజ్యసభసభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తన తండ్రి పేరుతో ఉన్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు రూ.110 కోట్లు మంజూరు చేయించలేక పోయారన్నారు. నాలుగున్నరేళ్లు వైసీపీ కోసం తాను ఎంతో కష్టపడినా గుర్తించకుండా సొంత ఇమేజ్ కోసం వేరే వ్యక్తికి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమింపచేయటం లో మాత్రం ఆయన కృతకృత్యులయ్యారన్నారు.

అనుచరులతో ర్యాలీగా వెళ్లిన తండ్రి, కొడుకులు

మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, కృష్ణచైతన్యలు అద్దంకి నుంచి ర్యాలీగా వెళ్లి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో టీ డీపీలో చేరారు. బల్లికురవ, పంగులూరు, సంతమాగులూరు, కొరిశపాడు మండల వైసీపీ అధ్యక్షులు చింతల పేరయ్య, యర్రం శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, రావి శ్రీధర్, పంగులూరు జడ్పీటీసీ రాయిని ప్రమీల సుబ్బారావు, కొరిశపాడు ఎంపీపీ సాధినేని మస్తాన్‌రావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, అద్దంకి మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, మాజీ ఎంపీపీ గోరంట్ల పద్మావతి శివాజీ, కామేపల్లి హనుమంతరావు, చింతా శ్రీధర్, గుండపనేని సుబ్బారావు, ఎం.సుబ్బారావు, సర్పంచ్‌లు ధూళిపాళ్ల వెంకటరావు, జక్రయ్య, బుల్లిరామయ్య, అమరనేని రమేష్, గుంజి జీవరత్నం, దివే రామాంజనేయులు జాగర్లమూడి సుబ్బారావుతో పాటు పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఎన్నికల కోడ్ ముంగిట సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి

అద్దంకి, మార్చి 16: ఎన్నికల కోడ్ కొన్ని గంటలలో వెలువడుతుందన్న ఉద్దేశంతో అద్దంకి మండలంలోని వైసీపీ నేతలు హడావుడిగా కొటికలపూడిలో గ్రామ సచివాలయం భవనాన్ని శనివారం ఉదయం ప్రారంభించారు. కనీసం ప్రజా ప్రతినిధులైనా సచివాలయం భవనంను ప్రారంభించారా అంటే అదీ లేదు. ఎంపీపీ హోదాలో అవిశన జ్యోతి ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ పక్కనపెట్టి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించటం చర్చనీయాంశంగా మారింది. గ్రామ సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారుడుగా ఉన్న పూనాటి విక్రమ్ ప్రారంభోత్సవానికి హాజరుకాలేదు. వైసీపీ నేతల ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించటం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు ఎలాంటి పదవి లేకపోయినా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పాణెం హనిమిరెడ్డి ప్రారంభోత్సవాలు చేయగా, శనివారం కొటికలపూడిలో ఆయన సోదరుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించటం మరింత విమర్శలకు తావిస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభోత్సవాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


చినగంజాంలో ర్యాలీకి జెండా ఊపుతున్న టీడీపీ నేతలు

పర్చూరు, మార్చి 16: టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పెద్దగంజాం మండలం పెద్దపల్లిపాలెం నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరారు. శనివారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఏలూరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి విజయం తథ్యమన్నారు. భారీ మెజారిటీతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తామన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయన్నారు. మత్యకారుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ విశేష కృషిచేస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వలలు, బోట్లు, పడవలు, ఐస్ బాక్సులు సబ్సిడీపై అందిస్తామన్నారు.

పార్టీలో చేరిన వారిలో కొల్లాటి సుబ్బారావు, కొల్లాటి బ్రహ్మయ్య, కనక శ్రీను, గోపి, బాలరాజు, సత్యనారాయణ, నాగరాజు, కృష్ణ, నాయుడు ఏడుకొండలు, వెంకటేష్, వాటిపల్లి ఆంజనేయులు, వీరాస్వామి, పోలయ్య, వెంకటసుబ్బారావు, మీరా సాహెబ్ నాయుడు, నాయుడు సుబ్బారావు, వాటిపల్లి శ్రీను, దండుప్రోలు వెంకటేశ్వర్లు, పీత సునీత, వల్లభనేని అదేమ్మ, దుర్గ లక్ష్మీ, సాంబమ్మ, తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ పీత భార్గవి, మాజీ ఎంపీటీసీలు కొక్కిలిగడ్డ రాములు, షేర్ వెంకటేశ్వర్లు, నాయకులు దండుప్రోలు బాలరాజు, వాటుపల్లి ఏడుకొండలు, తిరుపాలు, సంకే శ్రీను, గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

చినగంజాం, మార్చి 16: మండల పరిధిలోని పలుగ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంకు చెందిన 70 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు వీరయ్య తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరేందుకు వీరు పలువాహనాల్లో ర్యాలీగా చినగంజాం నుంచి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ నాయకులు ర్యాలీకి జెండా ఊపారు.

కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, అబ్దుల్‌కలాంఅజాద్, నక్కల వీరరాఘవులు, సందు శ్రీనివాసరావు, టి.జయరావు, నరహరి శ్రీనివాసరావు, కె.భాస్కరరెడ్డి, వాటుపల్లి ఏడుకొండలు, రాజు ఉదయ భాస్కరరెడ్డి, గంటా వెంకటనారాయణ, శేరు వెంకటేశ్వర్లు, నాంచార్యులు, కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన కిశోర్ కాలనీవాసులు

మార్టూరు, మార్చి 16: ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిదే అధికారమని చెప్పారు. శనివారం మార్టూరు గ్రామ పంచాయతీలోని కిశోర్ కాలనీవాసులు ఏలూరి క్యాంపు కార్యాలయంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎస్టీలకు రాజకీయపరంగా సముచిత స్థానం ఇచ్చినట్టు చెప్పారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఎస్టీల కుటుంబాల అభివృద్ధికి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనకు ప్రత్యేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కష్టపడి పని చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లినవారిని గుర్తించి ఎన్నికల సమయానికి వచ్చి ఓటు వేసేవిధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి శ్రీనివాసరావు, దురిశాల రామకృష్ణ, మల్లా వెంకటేశ్వర్లు, భోగ్య శ్రీను, భోగ్య రాజు, మల్లా పెదశ్రీను, ఏడుకొండలు, సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేయాలి

బల్లికురవ, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ విడుదలయిందని, తక్షణమే అన్ని గ్రామాలలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుపరచాలని ఎంపీడీవో హనుమారెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను తీసివేయించాలని చెప్పారు. అలాగే, గ్రామాలలో ఉన్న విగ్రహాలకు ముసుగు వేయించాలన్నారు. అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. రాజకీయ పార్టీల సమావేశాల్లో పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామానికి ముగ్గురితో టీంలను ఏర్పాటు చేశారు. వీరు నిరంతం గ్రామాలలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

టీడీపీలో చేరిన మాజీ మంత్రి పాలేటి


టీడీపీలో చేరిన డాక్టర్ పాలేటి రామారావు

చీరాల, మార్చి 16: మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో ఆయన సొంత గూటికి చేరినట్లయింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, డాక్టర్ పాలేటిలు ఇటీవల కలిశారు. రాజకీయంగా వారి మధ్య కొంత చర్చ జరిగింది. ఆక్రమంలో గరటయ్య, ఆయన తనయుడు కృష్ణచైతన్య టీడీపీలో చేరే విషయం కూడా చర్చకు వచ్చింది. అందులోభాగంగా గరటయ్య, చంద్రబాబుతో మాట్లాడి తనను కూడా పార్టీలో చేరేందుకు ముందస్తుగా మాట్లాడారని, ఆక్రమంలో గరటయ్యతో కలసి టీడీపీ చేరినట్లు డాక్టర్ పాలేటి తెలిపారు.